ఎవరు దొంగ?

బొల్లిముంత వెంకట రమణారావు

సమయం ఉదయం పదిన్నర కావస్తోంది... అది విజయవాడ బస్‌స్టేషన్! అక్కడంతా జనంతో కిటకిట లాడుతోంది. తెనాలి బస్సు కోసం ఎదురు చూస్తున్నాను నేను.

విజయవాడ ఎప్పుడొచ్చినా ఈ మాటలే మన చెవుల్లో పడుతూ వుంటాయి. "జేబు దొంగలున్నారు జాగ్రత్త!" "అపరిచితుల దగ్గర మీ సామాన్లు వదిలి వెళ్లవద్దు"లాంటి ప్రకటనలు మైకు ద్వారా వినపడుతున్నాయి.

అసలు జేబుదొంగలు మన జేబుల్లో నుండి పర్సులు ఎలా మాయం చేస్తారో చూడాలని నా ఆశ! వాడు పర్సు తీసేటప్పుడు పట్టుకొని అందరి ముందు ఒక హీరో ఫోజు పెట్టాలని నా కోరిక! అందుకే ఈసారి నా పర్సుని ప్యాంట్ బ్యాక్ పాకెట్‌లో నే వుంచాను.

తెనాలి బస్సు ప్లాట్‌ఫాం మీదకు వచ్చి ఆగింది. గుమికూడిన ప్రయాణీకుల్ని ఛేదించుకుంటూ బస్సులోనికి ప్రవేశించాను... ఆ మరుక్షణం ఉలిక్కిపడ్డాను! కారణం! ప్యాంట్ వెనుక జేబులోని పర్సు మాయమైంది!! నా వెనుకే బోల్డుమంది ఎక్కారు అంతమందిలో ఎవరు దొంగో ఎలా తెలుస్తుంది? అన్నది ఓ యక్షప్రశ్నే?

అయినా పర్సు కొట్టేసిన దొంగగారు ఇంకా అక్కడే ఎందుకుంటారు? నా పిచ్చి కాకపోతే! పర్సు పోయినందుకు కాదు నా బాధ. అది వ్యక్తిగత పరాభవంగా భావించాను.

మళ్లీ పర్సు కొట్టిన దొంగను తలచుకోగానే, అయ్యో పాపం! అంటూ నా పెదవిపై చిరునవ్వు మెరసి మాయమైంది.

గతంలో నా స్నేహితులకు జరిగిన అనుభవాలు గుర్తుకొచ్చాయ్... గబగబ బస్సు దిగి బస్‌స్టేషన్‌లో పోలీస్ కౌంటర్ దగ్గరకు ఫిర్యాదు చేయడానికి వెళ్లాను. నా పేరు... అడ్రసు, పర్సులో ఉన్న విలువ వ్రాసుకొని "పర్సు దొరికితే కబురు పంపుతామని" అన్న వారి మాటలకు నవ్వుకుంటూ వచ్చేశాను.

అక్కడే ఉన్న ఓ కానిస్టేబులు మీలాంటి చదువుకున్న వారు కూడా అజాగ్రత్తగా వుంటే ఎలా సార్? అని తన సహజ ధోరణిలో ఒక నతి వాక్యం చెప్పాడు.

మా అజాగ్రత్తయే కదా! మీకు శ్రీరామరక్ష! అని మనస్సులో అనుకున్నాను

నేను పోలీసు రిపోర్టు ఇవ్వడం చూసి ఏమిటి సార్? పోలీస్ రిపోర్టు ఇస్తే పోయిన డబ్బు తిరిగొస్తుందా? వచ్చినా తిరిగి ఇస్తారా? అంటూ, పలకరించాడు ఒక ఆసామి మొహం మీదకు చిరునవ్వు తెచ్చుకుంటూ. [illegible]

రాకపోవచ్చు కానీ, బాధ్యత గల ఓ పౌరుడిగా రిపోర్టు ఇస్తే దొంగలు ఎన్ని జేబులు కొట్టేసింది- తమకు అందవలసిన కమీషన్ పోలీసులు లెక్కవేసుకుంటారు.

నా మాటలకు "ఆ(!" అంటూ ఆశ్చర్యంతో ఆ పెద్దమనిషి నోరు తెరవడం చూసి "ఆరోగ్యానికి అంత మంచిది కాదు, దోమలు దూరిపోగలవు నోరు మూసేయండి!" అని ఒక పాత జోక్ పేల్చి ముందుకు కదిలాను.

ఆఫీస్ పనిమీద మళ్ళీ నాలుగు నెలల తర్వాత విజయవాడ రావటం జరిగింది. బస్టాండ్‌లో బస్సుదిగుతున్న నాకు గతం గుర్తుకు వచ్చింది. నాలో నేను నవ్వుకున్నాను. బస్టాండు నుంచి బయటకెళ్తున్న నన్ను ఎవరో పిల్చినట్లయింది "బాబుగారూ!" అన్న పిలుపుతో అటువైపు చూశాను.

సుమారు ముఫ్ఫై ఏళ్ళ వయస్సున్న వ్యక్తి ఒక కాలులేదు. మనిషి కాస్త బలంగానే వున్నాడు. మాసిపోయిన బట్టలతో ప్లాట్‌ఫాం మీద ఓ మూల, అతనిముందు ఒకగుడ్డ దానిపై చిల్లర పైసలు ప్రయాణీకులంతా తమకు తోచినంత చిల్లర పైసలు వేసి వెళ్తున్నారు. నేను ఒక పావలాబిళ్ళ వేసి అడుగు ముందుకేయబోయాను.

ఇంతలో "బాబుగారూ! నేను మిమ్మల్ని పిలిచింది యాచన కోసం కాదు..." అన్నాడు. ఆశ్చర్యంగా వెనక్కి తిరిగిచూశాను... అతని చేతిలో నల్లని పర్సు కనిపించింది. ఆ రోజు బస్సులో పోయిన పర్సు అదే!! "ఈ పర్సు నీ దగ్గరకెలా వచ్చింది"? అని ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"మీ పర్సే ఇది... నేనే కొట్టేశానండి!" నాకు నువ్వు చెప్పేది ఏమీ అర్థం కావటంలేదు. చూస్తే కుంటికాలుతో వున్నావ్? నువ్వెలా కొట్టేసావ్?

"అవునండీ! ఆ రోజు మీ పర్సు కొట్టిన తరువాతే నా కాలుపోయింది బాబుగారూ" అన్నాడు బాధగా.

......"ఆ రోజు సాయంత్రం పోలీసువాళ్ళకు

'ఎవరు దోషి?'

రోజులాగే మామూలు ఇవ్వాలని వెళ్ళడంతో మీరు డబ్బు పోయిందని రిపోర్టు ఇచ్చిన సంగతి తెల్సింది. మీ పర్సు వాటా డబ్బు అడిగారు. ఆ పర్సులో డబ్బులేదని చెబ్తే ఎవరు నమ్ముతారు? నేను దొంగనికదా? నన్ను విరగదీసి వదిలారు బాబుగారూ! వాళ్ళు కొట్టిన దెబ్బలకు ఈ కాలు విరిగింది. సమయానికి సరైన మందులు వాడనందువల్ల అవిటివాడినై పోయానంటూ" గద్గద స్వరంతో చెప్పాడు.

నేను తెల్లబోయి చూస్తూ ఉన్నాను.

బాబుగారూ! మిమ్మల్ని పిలిచింది ఒకే ఒక విషయం తెలుసుకోవాలని! ఆ పర్సులో నిజంగా డబ్బుందా? లేదా? ఉంటే ఏమయింది? లేకపోతే మీరు ఎందుకు రిపోర్టు ఇచ్చారు? అన్న ప్రశ్నలతో అప్రయత్నంగా నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

బాబుగారూ! మీరు బాధపడకండి... ఆ పాపిష్టి ప్రపంచం నుంచి విముక్తి పొంది, ఇప్పుడే మనిషిగా బ్రతుకుతున్నాను. అసలు విషయం తెలుసుకోవాలని తప్ప మిమ్మల్ని బాధపెట్టాలని కాదు అన్నాడు అతను.

"నిజానికి ఆ పర్సులో డబ్బులేదు. కేవలం పోలీసులను, దొంగలను ఒక నాటకం ఆడించాలని ఖాళీ పర్సునే జేబులో వేసుకున్నాను. కాని నేను చేసిన పని ఇలా ఓ వ్యక్తి అవిటితనానికి కారణమవుతుందనుకోలేదు" అన్నాను బాధగా.

"బాబుగారూ! ఈ దేశంలో కాళ్ళూ- చేతులు ఉన్నా డబ్బు లేకపోతే ఎవరూ సుఖంగా బ్రతకలేరు. ఇప్పుడు నాకు కాలు లేకపోవడంవల్లే రోజుకి పాతిక రూపాయల వరకు సంపాదిస్తున్నాను" అన్నాడు కాస్త గర్వంగా.

నేను మౌనంగా ఒక యాభైరూపాయల నోటు అతని చేతిలో బలవంతంగా పెట్టి వెనక్కు తిరిగాను. "బాబుగారూ! ఈ పర్సు నా దగ్గరే ఉంచుకుంటున్నాను. మీరు చేసిన మేలుకు కృతజ్ఞతగా" అని అతడన్న మాటలు వ్యంగ్యమో, నిజమో నాకర్థం కాలేదు.

నేనేం బదులివ్వలేదు... ఇప్పటికీ అతని అవిటితనానికి కారకులెవరో, దోషులెవరో నాకర్థం తెలీదు. ○

(4 వ పేజీ తరువాయి)

ఎదురు చూస్తున్నాను. నా విన్నపం ఏమిటంటే– ప్రస్తుత రచనలతో బాటు మన పత్రికలో లోగడ ప్రచురితమైన సీరియల్స్ కంటిన్యూగా ప్రచురించమని. ఎందుకంటే నేటి తరానికి గొప్పవారి గురించి తెలియాల్సిన అవసరం ఎంతైనా వుంది! ఆనాటి స్థితిగతులు, పరిస్థితులు, తెలుసుకోవటమే గాక కరువైపోతున్న మంచి మానవత్వాల గురించి గుర్తు చేయాల్సిన గురుతర బాధ్యత మీపైవుంది కనుక. నేటి వేగవంతమైన నాగరికతకు కళ్ళెం వేసి కనులు తెరిపించాల్సిన అవసరం ఎంతో వుంది. దాని కోసం సాహితీరంగంలో మార్పులు ఎంతైనా అవసరం. మీరు సాధిస్తారనే నేను ఆశిస్తున్నాను. యువ రచయిత లకు మీరిస్తున్న ప్రోత్సాహం కూడా బావుంది.

జి. బాలాజీ
కొంగారెడ్డిపల్లె

కథలు

ఈ వారం పత్రిక నిజంగా ముత్యం,

వీక్లీ పోస్ట్

10-8-90 కథ చాలా బావుంది. 'నీ వెనుక నీ నీడ' రచన కె. కె. రఘునందన బాగా చేశారు.

కొటికలపూడి శివరామప్రసాద్
(హైద్రాబాద్)

మోతాదుగా

సాహిత్యం పట్ల ఆసక్తి, అభిరుచి ఉన్న పాఠకుడు కాని పాఠకురాలు కాని రచనల్లో క్రొత్త విషయాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారే తప్ప కేవలం సెక్స్ కథలు కావాలని ఎవరూ అడగరు. అంత మాత్రం చేత సెక్స్ కథలు అసలు రాకుండా ఉండాలని అనకూడదు. బాలలకు బాలపత్రికలు, మహిళలకు పత్రికలు ఉన్నట్లే యువతరానికి ప్రత్యేకించి కొన్ని పత్రికల్లో ఒక శృంగారమైన కథను ప్రచురిస్తే వాళ్ళు ఆ కథతో పాటు ఆ పత్రికను మొత్తం క్షణంలో చదివేస్తారు. కానీ కథనంలో ఎక్కువగా సాహిత్యాన్ని నింపి అవసరమైనంత వరకే శృంగారాన్ని పెట్టి అసభ్యత, అశ్లీలతలకు తావు లేకుండా చేస్తే అది సర్వజన ఆమోదం పొందగలుగుతుంది. అందుచేత నేడు పెరుగుతున్న విజ్ఞానాభివృద్ధితో పాటు సైంటిఫిక్‌గా పాఠకులకు కొంత సెక్స్ పరిజ్ఞానం తెలుసుకొని ఉంటే లైఫ్‌లో కొంచెం థ్రిల్‌ను పొందే అవకాశం కలుగుతుంది.

కొరబండి శ్రీనివాసరావు
ఒంగోలు

కవిత

వారపత్రిక 6.4.90 లో ప్రచురించిన కవిత "ఓ మనిషీ" చాలా బాగుంది. రచయిత్రి దగాని సుధగారికి నా శుభాకాంక్షలు.

దగాని మాధవి
హైదరాబాద్
○